క్లుప్తంగా

మాజీ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు


మహేంద్రరెడ్డి

కౌతాళం: వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక చేయడంతో పాటు కళ్యాణదుర్గం, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాల పర్యవేక్షణ బాధ్యత అప్పగించినందుకు మాజీ ముఖ్యమంత్రికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి మహేంద్రరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని కామవరం గ్రామానికి చెందిన మొలగవల్లి మహేంద్రనాథ్‌రెడ్డి రాష్ట్ర స్థాయి కార్యదర్శి పదవి ఇవ్వడం పట్ల ఆయన అభిమానులు, కౌతాళం సింగల్ విండో మాజీ అధ్యక్షుడు వీరసేనరెడ్డిల ఆధ్వర్యంలో కామవరం గ్రామంలో సంబరాలు చేసుకున్నారు. మహేంద్రరెడ్డికి అభినందనలు తెలిపారు.

వంకదారు శ్రీనాథ్‌గుప్తాకు అవార్డు



మంత్రి టి.జి.భరత్ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న శ్రీనాథ్‌గుప్తా

ఆదోని అర్బన్: పట్టణ ఆవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా ప్రత్యేక అవార్డును అందుకున్నారు. ఆదివారం కర్నూలులోని ఆవోపా భవన్‌లో ఆవోపా విద్యా నిధి రజతోత్సవ సంబరాల సభ జరిగింది. వంకదారు శ్రీనాథ్‌గుప్తా సేవలను గుర్తించి సభలో మంత్రి టీజీ భరత్ చేతులమీదుగా అవార్డు అందించారు. సభలో మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి.వెంకటేష్, ఏపీ ఆవోపా సంస్థాపక అధ్యక్ష కార్యదర్శులు పువ్వాడి చంద్రశేఖర్, రత్న ప్రసాద్, రాష్ట్ర కో ఆర్డినేటర్ మల్లి పెద్ద నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగాభవానికి ప్రత్యేక పూజలు


గంగాభవానీ అమ్మవారు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో వెలిసిన గంగాభవాని ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి సోమవారం నాటికి 75 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు గంగపుత్ర సంఘం నాయకులు, గంగాభవాని మాత సేవా బృందం నాయకులు తెలుగు ఈరన్న, మేఘనాథ్, ఆటో వెంకటేష్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, ఆకుపూజలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బేల్దారు శ్రీనివాసులు, దుల్లయ్య, కృష్ణమూర్తి, రాయచూరు నాగేష్, రామాంజనేయులు, సోమప్ప, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం



ఉత్తమ అధ్యాపకుడు, డీఎస్సీకి ఎంపికైన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న నాయకులు

ఆదోని రూరల్: అభ్యుదయ దళిత సేవా సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న కౌతాళం జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఎం.సంతోష్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో సీనియర్ అడ్వకేట్ డి.చంద్రయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంతోష్‌కుమార్‌ను పూలమాల, శాలువాతో సత్కరించారు. అలాగే ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా స్థాయిలో 4వ ర్యాంకు సాధించిన చుక్క సురేష్‌ను కూడా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సి.ఆర్.స్వామి, మల్లికార్జున, ఆంజనేయులు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



హొళగుంద: దేవరగట్టు క్షేత్రంలో వెలిసిన మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం మూల విరాట్‌కు సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళ హారతి, అర్చనలతో పాటు ఇతర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాళ మల్లేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆస్పరి స్వామి మఠంలో అన్నదానం చేశారు.

అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ

- ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతుల ఆవేదన
- రైతులకు మద్దతుగా రేపు 'అన్నదాత పోరు'
- విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పిలుపు


పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందని, ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాతలు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆదోని పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాతల పోరు పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి, పార్టీ నాయకులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, మహిళా విభాగం నాయకురాళ్లలతో కలిసి విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతన్నకు బాసటగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పట్ల చిన్నచూపు చూస్తోందని, అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయకపోయిందన్నారు. ప్రభుత్వం 16 నెలలుగా రైతులను మోసగిస్తూనే కాలయాపన చేస్తుందని విమర్శించారు. అన్నదాతలు కష్టపడి పండించిన కూరగాయలు, దిగుబడులకు గిట్టుబాటు ధర లేక గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడేలేడని ఆరోపించారు.

రైతుల సత్తా ప్రభుత్వానికి చూపాలి

సెప్టెంబర్ 9వ తేదీన రైతులు తలపెట్టిన ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాతల పోరు కార్యక్రమాన్ని చేపడతామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. 9న ఉదయం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి ఆదోని సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామని చెప్పారు. రైతు పోరు కార్యక్రమానికి ఆదోని నియోజకవర్గంలోని పల్లెపల్లె నుంచి భారీ ఎత్తున తరలివచ్చి రైతుల సత్తా ఏమిటో ప్రభుత్వానికి చూపాల్సిన సమయం ఆసన్నమయ్యిందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మెడలు వంచాలంటే రైతులు సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మహేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ ఆదోని నియోజకవర్గ కార్యదర్శి వై.పి.గంగాధర్, కామాక్షి తిమ్మప్ప, ఎర్రిస్వామి, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతులను ముంచడం చంద్రబాబుకు పరిపాటే


అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం రూరల్ : రైతులు ముంచడం చంద్రబాబు పరిపాటిగా మారిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. రైతులను కూటమి ప్రభుత్వం నట్టేముంచిందని ఆరోపించారు. ఆదివారం భీమా నిలయంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులతో కలిసి అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ..ఈ నెల 9న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే అన్నదాత పోరు ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని రైతులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. రైతులకు గోడు ప్రభుత్వానికి పట్టడడం లేదన్నారు. పండించి పంటలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. అలాగే రైతులకు యూరియా అందక ఆందోళన చెందుతున్నారని, కూటమి ప్రభుత్వం యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. ఉల్లి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు వైఎస్సార్‌సీపీ అన్ని విధాల అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ రెడ్డి, ఈరన్న, నాయకులు నారాయణరెడ్డి, పూజ రాఘవేంద్ర, నారాయణపురం గురురాజ్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

యూరియా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు యూరియా ఇవ్వలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం వుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక ఆరోపించారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 9న చేపట్టనున్న₹అన్నదాత పోరు₹ కార్యక్రమ పోస్టర్లను ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు న్యాయం చేసేందుకు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యూరియా కోసం రైతులకు అండగా పార్టీ ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. రైతుల యూరియా కష్టాలను అర్థం చేసుకోలేని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు రైతుల పట్ల వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మంత్రే యూరియా ప్రైవేట్‌కు కొంత ఎక్కువే ఇచ్చామని చెప్పారన్నారు. బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఘోరమన్నారు. కూటమి ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తోందని రైతులకు ఎంతమేర యూరియా అవసరమో ఆమేరకు సరఫరా చేయలేని స్థితిలో వుందని దుయ్యబట్టారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు సంక్షేమ నిధి

ఉల్లి, మిరప, పత్తి, చీనీ తదితర పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి విఫలమైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్ సారథ్యంలోని ప్రభుత్వం రూ.7,800ల కోట్లతో సంక్షేమ నిధి ఏర్పాటు చేసి రైతులను ఆదుకున్నారని గుర్తు చేశారు. వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పంట నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని, వారికి కావాల్సిన యూరియాను సరఫరా చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. 9వ తేదీన నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా ఆదోని ఆర్డీఓ కార్యాలయంలో సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చే కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, పార్టీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ, పార్టీ రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కనకవీడు లక్ష్మీకాంతరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి, సాంస్కృత విభాగం కార్యదర్శి కాశిరెడ్డి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఎంకె శివప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.

'పోరు'ను విజయవంతం చేద్దాం


వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డితో ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి

కోసిగి/మంత్రాలయం రూరల్: రైతు సమస్యల పై ఈనెల 9న నిర్వహిస్తున్నన్ అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మినూరు నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాంపురంలోని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి స్వగృహంలో జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డిని ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి కలిశారు. అన్నదాత పోరుకు నియోజకవర్గం నుంచి రైతులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, సోగనూరు భీమారెడ్డి, వెంకటరెడ్డి, జాన హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో చిన్నారుల ప్రతిభ


ప్రదర్శన ఇస్తున్న శ్రీ గురుకృప కూచిపూడి నాట్యాలయ కళాకారులు

ఆదోని అర్బన్: నంద్యాల కళారాధన సంస్థ వారు మాతృభూమికి కళార్చన 2025 పేరిట శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో ఆదోనికి చెందిన శ్రీ గురుకృప కూచిపూడి నాట్యాలయ చిన్నారులు ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు నిర్వాహకులు వీరజ్ రాయల్ ఆదివారం తెలిపారు. సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి ఎం.మాన్విశ్రీ గెలుపొందగా, తృతీయ బహుమతి సి.శ్రీనిధి గెలుపొందగా, స్పెషల్ జ్యూరీ పి.బోధన, ఎం.సాన్విశ్రీ, పి.స్వాతి గెలుపొందారు. సీనియర్ విభాగంలో గ్రూప్ సాంగ్‌లో శ్రీ గురుకుల కూచిపూడి నాట్యాల ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. జూనియర్ విభాగంలో స్పెషల్ జ్యూరీ విభాగంలో సి.సుకృతి, హెచ్.ఎస్.కృతి గెలుపొందారు. జూనియర్ గ్రూప్ విభాగంలో ప్రథమ బహుమతి దక్కించుకున్నారు. సబ్ జూనియర్ విభాగంలో ద్వితీయ బహుమతి కె.ధరణి గెలుపొందగా, తృతీయ బహుమతి ఎస్.మనోజ్ఞ గెలుపొందారు. సబ్‌జూనియర్ గ్రూప్ విభాగంలో తృతీయ బహుమతి గెలుచుకున్నారు.

తాగునీరు వృథా!


ధర్మపురంలో బీసీ కాలనీలో కుళాయి నుంచి వృథాగా పారుతున్న నీరు

నందవరం : గ్రామాల్లో తాగు నీరు లేక ఇబ్బందులు పడుతుంటే.. మరో పైపు కుళాయిలకు బిరడాలు లేక వృథాగా పారిపోతున్నాయి. నందవరం మండల పరిధిలోని ధర్మపురం గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం వీధి, బీసీ కాలనీలో కుళాయిలకు ట్యాప్‌లు లేక పోవడంతో నీరు వృథాగా కాలువలోకి పారితోంది. పంచాయతీ అధికారులు స్పందించి కుళాయిలకు బిరడాలు బిగించి వృథాగా పోతున్న నీరుని అరికట్టాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.

15న ఆదోనిలో కేవీపీఎస్ సదస్సు


మాట్లాడుతున్న కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి ఆనందబాబు

ఆదోని రూరల్: డివిజన్‌లో దళితుల పట్ల చూపుతున్న కుల వివక్ష, అంటరానితనం, దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా ఈనెల 15న పట్టణంలోని ఎన్జీఓ హాల్‌లో జిల్లా స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఆనందబాబు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 75 సంవత్సరాల రాజ్యాంగం అమలు అనంతరం కూడా హక్కులను దళితులకు అమలు చేయడంలో పాలకవర్గాలతో పాటు అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత తమది కాదన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సదస్సుకు ప్రతిఒక్కరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కేవీపీఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఎస్.గోపాల్, జిల్లా సహాయ కార్యదర్శి చిన్నమారయ్య, జిల్లా కమిటీ సభ్యులు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించండి

ఆదోని సెంట్రల్: రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రజక సంక్షేమ సంఘం చైర్ పర్సన్ సి. సావిత్రి కోరారు. ఆదివారం ఉమ్మడి విశాఖ రజక సేవా సంఘం అధ్వర్యంలో జరుగుతున్న రజకుల అకాంక్ష సభలో రాష్ట్ర మంత్రులకు విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోల 24, 18, 19, 348, 38ను సవరించి ప్రజలకు మరింత మేలు జరిగేలా ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయాలని కోరారు.

ఆదోనిని అభివృద్ధి చేసుకుందాం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీలు డాక్టర్ మధుసూదన్, బీటీ నాయుడు, ఎమ్మెల్యే పార్థసారథి, డీఎస్పీ హేమలత తదదితరులు

ఆదోని టౌన్: రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ఆదోనిని జిల్లా కేంద్రంగా సాధించుకుందామని, అభివృద్ధి చేసుకునేందుకు పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు తరలిరావాలని ఎమ్మెల్సీలు డాక్టర్ మధుసూదన్, బి.టి.నాయుడు, ఎమ్మెల్యే పార్థసారథి పిలుపునిచ్చారు.ఆదివారం స్థానిక మర్చంట్స్ క్లబ్ రీడింగ్ రూంలో మర్చంట్ క్లబ్ శతాబ్ది ఉత్సవాలను క్లబ్ ప్రెసిడెంట్ మల్లికార్జున, ఉపాధ్యక్షులు దేవిశెట్టి ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్సీలు మాట్లాడారు. ఆదోనికి ఆంధ్రా ముంబాయిగా పేరు ఉండేదని, ఆదోనిలో పరిశ్రమలు మూతబడి దివాళా తీశాయన్నారు. ప్రతిఒక్కరూ కలిసికట్టుగా తరలివచ్చి ఆదోనిని జిల్లా కేంద్రంగానూ, అదనంగా నాలుగు మండలాలుగా సాధించుకుని, అన్నివిధాలా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి ఉద్యమాలను ఉధృతంగా చేపడతామన్నారు.

ఆదోనికి ఘనమైన చరిత్ర

ఆదోనిలో 160 ఏళ్ల చరిత్ర గలిగిన మున్సిపాలిటీ, 155 ఏళ్ల రైల్వేస్టేషన్, 345 సంవత్సరాలు చరిత్ర కలిగిన జామియా మసీదు, సుమారు 500 సంవత్సరాల చరిత్ర ఉన్న ఆదోని అన్నింటా అభివృద్ధిలో వెనకబడి ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఆదోని డీఎస్పీ హేమలత, పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, మర్చంట్ క్లబ్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వార్డు కౌన్సిలర్‌కు పరామర్శ


కౌన్సిలర్ రంగమ్మను పరామర్శిస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 18వార్డు కౌన్సిలర్ బోయ రంగమ్మ భర్త బోయ హనుమంతు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, పార్టీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ ఆమెను పరామర్శించారు. ఆదివారం వారి ఇంటికి వెళ్లి ఆమెతో పాటు ఆమె కుమారుడు వార్డు ఇన్‌చార్జ్ సోమేష్, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఆదోని మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: ఆదోని మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలని, పీపీపీ పేరుతో మెడికల్ కాలేజీలు ప్రయివేట్ వారికి అప్పగించరాదని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు, రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం వారు సీపీఎం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల వద్ద రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ మెడికల్ కాలేజ్ నిర్మాణాన్ని, నిర్వహణను ప్రయివేట్ వ్యక్తులకు అప్పజెప్పడంతో పేదలకు వైద్యం దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. గతంలో సీఎం చంద్రబాబునాయుడు యూజర్ చార్జీల పేరుతో పేదలకు వైద్యం దూరం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వీరేశేఖర్, హనుమంతు, తిక్కన్న, రంగారెడ్డి, లింగన్న, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

గోనెగండ్ల : మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామానికి చెందిన బోయ చంద్రన్న(65) అనే వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు సీఐ విజయ భాస్కర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బోయ చంద్రన్నకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చంద్రన్నకు ఐదు సంవత్సరాలుగా ఆయసం, ఉబ్బసం వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకున్నా వ్యాధి న్యాయం కాలేదు. ఈ నేపథ్యంలో మూడేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం తెల్లవారు జామున బాత్రుమ్‌కు వెళ్లి పత్తి పంటకు కొట్టే దోమల మందును తాగి సృహకోల్పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చంద్రన్నను ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. కుమారుడు దస్తగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉల్లి ముందస్తు కోతలు వద్దు


ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి

ఎమ్మిగనూరురూరల్: ఉల్లి సాగు చేసే రైతులు ముందస్తుగా కోతలు కోయకుండా ఉల్లిగడ్డ సరైన సైజు వచ్చిన తర్వాతనే కోయాలని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ శివ శంకర్ సూచించారు. ఆదివారం వారు మాట్లాడుతూ ముందుగా కోస్తే గడ్డ చిన్నగా ఉండటంతో ధర తక్కువగా పలుకుతుంది చెప్పారు. కాబట్టి పంట పూర్తి కాలం అయ్యాక కోత కోయాలని సూచించారు. అలాగే సబ్ డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాలు, డీలర్ల వద్ద 247.7 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లోని ఫర్టిలైజర్స్ డీలర్స్ దగ్గర కూడా యూరియా స్టాకు ఉందని తెలిపారు.

ఆదోని డివిజన్‌కు 2,680 టన్నులు..

ఆదోని రూరల్: ఆదోని డివిజన్‌కు 2,680 టన్నుల యూరియా సరఫరా అయినట్లు ఏఓ సుధాకర్ ఆదివారం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆదోని రేక్ పాయింట్‌కు ఐపీఎల్ కంపెనీ నుంచి మొత్తం 2,680 టన్నుల యూరియా అందిందన్నారు. ఇందులో 1,875 టన్నులు మార్క్‌ఫెడ్ గోడౌన్‌కి, 805 టన్నులు ప్రయివేట్ డీలర్లకు కేటాయించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెక్కష్ణ

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో వున్న హిందీ, తెలుగు ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులివ్వాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెక్కష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డీటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వి.జి.వెంకట్రాముడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా హిందీ, తెలుగు ఉపాధ్యాయ పదోన్నతులు నిలిచిపోయాయని, దీంతో ఆయా సబ్జెక్ట్‌ల బోధన కుంటుపడుతుందన్నారు. వాటిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు సత్వరం పదోన్నతులపై వున్న కోర్ట్ కేసు సమస్యలను పరిష్కరించి పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని కోరారు. సమావేశంలో డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గోట్ల చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి పాటిల్ ఈశ్వర్‌రెడ్డి, మండల నాయకులు చిన్న వీరేష్, రంగస్వామి పాల్గొన్నారు.

దైవమార్గాన్ని అనుసరించాలి


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం పెద్దలు

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఒక్కరు దైవ మర్గాన్ని అనుసరించాలని ముస్లిం మత పెద్ద సయ్యద్‌షా మహమ్మద్ హుసేన్‌పీర్ ఖాద్రీ అన్నారు. ఆదివారం పట్టణంలోని కర్నూలు రోడ్డులోని షాదీఖాన ఎదురుగా మజిదే సయ్యద్ ఇస్మాయిల్ పీర్ పేరుతో నూతన మసీదు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయనతో పాటు సయ్యద్‌షా తాహెర్, అహ్మద్‌పాష, అతహర్ పాషాలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక జామియా మసీదు పెద్దలు ఖాశింబేగ్, పలు మసీదుల ముత్తవల్లిలు ఫకీర్‌సాబ్, అలీపీర, రషీద్, మేటి షఫి, మహబుబ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని వి.తిమ్మాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ నరసింహులు(47) గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చెరుకుని నరసింహులు మృతదేహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మట్టి ఖర్చులకు గానూ రూ.10 వేలు కుటుంబ సభ్యుల సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.